# యదార్థవాది

శ్రీ బి. ఆర్. రావ్

సుబ్బన్న యదార్థవాది. అక్షరాలా ఆచరించే మనిషి. ముష్టివాడువచ్చి 'బాబూ! రెండు బియ్యంగింజలు పెట్టించండీ' అంటే 'రెండే రెండు' బియ్యంగింజలు తెచ్చి వేస్తాడు. ముష్టివాడు 'ఇదేమిటిస్వామీ!' అని అడిగితే 'రెండే వెయ్యమన్నావుగా మరి' అని చెప్తాడు సుబ్బన్న. 'పిడికెడు వెయ్యండీ!' అంటే వేస్తాడు. తగినపని చేదామని 'బస్తాడు వెయ్యండీ' అంటే 'లేదు' అని సమాధానం చెప్తాడు. అసలు సున్నా అవుతుంది.

సుబ్బన్న ఓ షావుకారు యింట్లో 'నౌకరీ'కి కుదిరాడు. ఓరోజున పిల్లాణ్ణి యెత్తుకున్నాడు. వాడు గోలపెట్టేస్తున్నాడు. షావుకారుకి కోపంవచ్చి 'గుంటణ్ణి గొయ్యి తీసిపాతేరా' అన్నాడు. ఆలస్యం చెయ్యకుండా సుబ్బన్న 'పార' పట్టుకు వీధిలో గొయ్యి తీస్తున్నాడు. 'ఎందుకురా అక్కడ గొయ్యి తవ్వుతున్నావ్' అని అడిగితే, 'పాతేమన్నారుగా పాపాయిని' అని సమాధానం. షావుకారు 'ఇంత యదార్థవాదిని' వుంచితే రేపొద్దున్న 'దివాల జండా' యెత్తాల్సి వస్తుందని 'డిస్‌మిస్' అన్నాడు.

సుబ్బన్నకు ఓరోజున 'వివాహమహోత్సవ ఆహ్వాన పత్రిక' వచ్చింది. అందులో యిలావుంది...

...సకుటుంబ బంధు మిత్ర సపరివారంబుగావచ్చి మేమొసంగు యథోచిత సత్కారంబులం గైకొని వధూవరుల నాశీర్వదించి...............

'సరే' అన్నాడు సుబ్బన్న—

మరుసటిదినం 'పెళ్ళివారి యింటి వేపు ఓ పెద్ద జనసమూహం వస్తోంది. వాళ్లందరినీ మన 'సుబ్బన్న' 'గైడు' చేస్తున్నాడు కమాండరిన్ చీఫులాగ. అంతావచ్చి పెళ్ళివారింటిముందర 'హాల్టు' అయ్యారు. పెళ్ళిపెద్దపోయి 'ఏం సుబ్బన్నగారూ! యెవరు వీళ్ళంతా?' అని ప్రశ్నిస్తే, సుబ్బన్న ఓ డజను మందిని చూపించి 'వీరు నా కుటుంబం, తతిమ్మా వారంతా బంధుమిత్ర పరివారం' అన్నాడు.

పెళ్ళిపెద్ద కొంచెమైనా చలించకుండా చిత్తం, 'లోనికి దయచేయండి' అని ఓ పెద్ద యింట్లోకి తోలేడు ఆ మందని.

భోజనాలదగ్గర విస్తళ్ళు వేశారు. ఒక్కొక్కరికీ ఓ స్పూనుడేసి 'అంబలి' వడ్డించడం ఆరంభించారు. అందరూ ముఖముఖాలు చూసుకొన్నారు. ఎలాగో తిని లేచారు.

పెళ్లిపెద్ద యిలా అన్నాడు 'సుబ్బన్నగారూ! ఏదో యథోచిత సత్కారములు' ఆనందంతో స్వీకరించినందుకు ధన్యుణ్ణి. మా యిల్లు పావనమైంది. ఇహ వధూవరుల నాశీర్వదించాలి పెద్దలు! అన్నాడు అతి వినయంతో చేతులుమోడ్చి.

'ఈ పాడు ప్రపంచంలో యదార్థజీవులకి తావులేదు' అనుకున్నాడు యదార్థవాది సుబ్బన్న.